# తమ మౌలిక సమస్యల పరిష్కారానికి సంఘటితపడటమే వలస కార్మికుల కర్తవ్యం

**కరోనా** (కోవిడ్-19) నివారణకు కేంద్ర ప్రభుత్వం మార్చి 24 నుంచి లాక్‌డౌన్ ప్రకటించడంతో వలస కార్మికుల బతుకులు మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా తయారైనాయి. అన్ని రంగాలలో ఉత్పత్తి కార్యకలాపాలు నిలిచి పోయాయి. ప్రజా - ప్రయివేట్ రవాణా రంగం ఆగిపోయింది. అంతర్‌జిల్లాల - రాష్ట్రాల మధ్య ప్రయాణానికి రకరకాల ఆంక్షలు పాలకులు విధించారు.

అన్ని రంగాలలో ప్రభుత్వ - ప్రయివేట్ కార్యాలయాలలో, కార్పొరేషన్ సంస్థలలో, ప్రభుత్వ - ప్రయివేట్ పరిశ్రమలలో పనిచేసే ఒప్పంద, పొరుగుసేవల ఉద్యోగుల, కార్మికుల జీవనోపాధి తీవ్ర సంక్షోభంలో పడింది. నిత్యావసరాల సరఫరా - రవాణా కోసం మినహాయింపు ఇచ్చారు. కాని మొత్తం సామాజిక జీవన కార్యకలాపాలను స్థంభింప చేశారు. ఈ విధంగా రాజ్యం ఎంత నియంతృత్వంగా వ్యవహరించుతుందో, దాని బ్యూరోక్రసీ ఎంత నిరంకుశత్వాన్ని చెలాయిస్తుందో యీ కరోనా కాలంలో మరింత బాహాటంగా బహిర్గతమైంది.

**దిక్కుతోచని దుస్థితిలో వలసకూలీలు:**

తొలివిడత 21 రోజులు ముగిసే ముందు రెండోవిడత లాక్‌డౌన్‌ను ప్రభుత్వం ప్రకటించింది. దీంతో వలస కార్మికుల గుండె నిబ్బరత చెదిరింది. ఎందుకంటే వారు పనిచేసే ప్రదేశాలలో అంతవరకు పొందుతున్న జీతాలు నిలిచిపోయాయి. వారికి ప్రభుత్వాల ఆర్థికసాయం, రేషన్ లేదు. సాధారణంగానే వారికి తగిన నివాస వసతి లేదు. ఇక లాక్‌డౌన్ మార్గదర్శకాలను ఎలా పాటించగలరు?

ఈ దురవస్థల మధ్య కాలినడకన బయలుదేరి, సొంత గ్రామాలకు చేరడమే మార్గమని భావించారు. కృతనిశ్చయంతో ఎక్కడికక్కడి వారున్నచోటునుండి ఒక ఉద్యమంలా పయన మయ్యారు. అందుకు ఎవరూ పిలుపివ్వలేదు, ఆర్గనైజ్ చేయలేదు. అయినా పయనమయ్యారంటే, తాము ఎదుర్కొంటున్న నికృష్ట పరిస్థితులు, ఆకలి బాధలు ఒక భావనకు వచ్చేలా ప్రేరేపించాయి. ఇటువంటివి చరిత్ర గమనంలోకి తొంగిచూస్తే అనుభవాలు మనముందుకు వస్తాయి.

కరోనా-లాక్‌డౌన్ కాలంలో చట్టం మేరకు ఎటువంటి రాయితీలు వలస కార్మికులు పొందలేకపోయారు. కరోనా - లాక్‌డౌన్ వంటి విపత్తుల సమయంలో వారిని ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలదే. ఇటువంటి విపత్తులను అధిగమించడానికి కేంద్రం అత్యవసరంగా ప్రత్యేకంగా ఆహార ధాన్యాలను కేటాయించి, నిలువచేస్తుంది. వలస కార్మికులకు మరియు అసంఘటిత కార్మికులకు కూడా ఉచితంగా ఈ ఆహారధాన్యాలు పంపిణీచేసి, ఆదుకోవచ్చు. కాని ఆ పనిని పాలకులు నిర్వర్తించక పోవడం దారుణం!

ఆహారధాన్యాల నిల్వల గురించి ఐఎఎస్ విశ్రాంత ఉన్నతాధికారి కె.ఆర్.వేణుగోపాల్ "వలసకూలీ-కడుపు ఖాళీ"అన్న ప్రధాన శీర్షికతో రాసిన వ్యాసం ఈనాడు పత్రిక ప్రచురించింది. ఏం రాశారో ఒకసారి చూద్దాం.

"దేశంలో చాలినంత ఆహార నిల్వలు వున్నాయని కేంద్ర ప్రభుత్వం భరోసా ఇస్తోంది. అయిదుకోట్ల 30 లక్షల టన్నుల ధాన్యం అందుబాటులో వుందని, అందులో మూడుకోట్ల టన్నులు వరి కాగా మిగిలినది గోధుమ అని కేంద్ర ఆహార ప్రజాపంపిణీ వినియోగవ్యవహారాల మంత్రిత్వశాఖ ఇటీవల గణాంకాలు వెల్లడించింది. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు 76 లక్షల టన్నుల వరి, కోటి 38 లక్షల టన్నులు గోధుమ మొత్తంగా కలిపి రెండుకోట్ల 14 లక్షల టన్నుల అదనపు నిల్వలు భారత ఆహారశాఖ వద్ద ఎప్పుడూ సంసిద్ధంగా వుండాలి. ఇప్పుడు అవసరమైన దానికంటే పెద్దమొత్తంలో అదనపు ఆహారనిల్వలు పోగుపడ్డాయి. కానీ, ఇంత ధాన్యం మన గాదెల్లో మగ్గుతున్నా 20 కోట్లమంది ఆకలితో సతమతమవుతుండటమే విచిత్రం. పేదవాడి ఆకలి మాపాల్సిన ఆహార ధాన్యాలు గిడ్డంకులకే పరిమితమవుతున్న దుస్థితి మనముందుంది. .................దేశాన్ని ఇప్పుడు ఒకవైపు ఆకలి, మరోవైపు కరోనా వణికిస్తున్నాయి. మరీ ముఖ్యంగా దేశంలోని వలసకూలీలకు ఈ జంట ప్రమాదాలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. జనుల ఆకలి తీర్చగల స్తోమత ప్రభుత్వానికి వుంది." (- ఈనాడు, 15-4-2020)

**వలసకార్మికుల చట్టం 1979 - అమలు తీరుతెన్నులు**

వలసకూలీలు 1947కు పూర్వం, తర్వాత పరాయిదేశాలకు ఉపాధికోసం వెళ్ళుతూనే వున్నారు. ఆంగ్లేయుల వలస పాలనా కాలంలో బర్మా, మలయా, దక్షిణాఫ్రికా వగైరా దేశాలకు వెళ్ళారు. తర్వాత ముఖ్యంగా గల్ఫ్ దేశాలకూ వెళ్తూన్న విషయం చూస్తున్నాం. ఇక దేశంలో, ప్రతి రాష్ట్రం నుంచి, మరొక రాష్ట్రానికి వలసలు సాగుతూనే వున్నాయి, పెరుగుతూనే వున్నాయి.

ముఖ్యంగా 1950, 1960, 1970 దశ కాలలో వలసలు బాగా విస్తరించాయి. నీటి ప్రాజెక్టులు, పెద్ద పరిశ్రమలు నిర్మాణాలైనాయి. 1970-80 దశకాలల్లో ప్రయివేట్ రంగంలోను జరిగాయి. తొలుత వలస కార్మికుల - స్థానిక కార్మికుల మధ్య పోటీనెలకొన్నది. ఈ సమస్యను పరిశీలించేందుకు కేంద్ర - రాష్ట్ర కార్మికశాఖల మంత్రుల సమావేశాన్ని 1956 అక్టోబరులో నిర్వహించి, ఒక చట్టం చేయాలని ఆ సమావేశం తీర్మానించింది. కేంద్రం ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటుచేసింది. అది

చేసిన సిఫార్సులు – వీటిమీద చర్చలు సాగి సాగి ఎట్టకేలకు 1979 జూన్‌లో లోక్‌సభ ఒక చట్టాన్ని ఆమోదించి, అదే నెల నుంచి అమలు చేసింది. ఈ చట్టానికి ఆధారం 1970 ఒప్పంద కార్మికుల చట్టం! దీనిని అనుసరించి, “అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టం–1979” చేశారు.

ఆనాటి గణాంకాల ప్రకారం వలసకార్మికులు 11.81 కోట్లు. ఆ తర్వాత లెక్కలు కూడా పై సంఖ్యకు అటుఇటుగానే వుంటున్నాయని పాలకులు చెబుతున్నారు.

వలన కార్మికులకు ఉపశమనం కల్గించే కొన్ని నిబంధనలైనా ప్రయివేట్ సంస్థల యాజమాన్యాలు, ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వేతర కార్పోరేషన్ సంస్థలు వగైరాలేవి కనీసంగా అమలు చేయలేదు. అధికారుల అజమాయిషీ, పర్యవేక్షణా లేవు. నీరుగార్చి, నిర్వీర్యం చేశాయి. ఆ చట్టం అమలు డొల్లతనాన్ని లాక్‌డౌన్ పర్యవసానాలు బహిర్గతం చేశాయి. ఇప్పుడు దానిని సమీక్షించి, మెరుగుపర్చాలని సంస్కరణవాదులైన కొంతమంది బూర్జువా మేధావులు పాఠాలు వల్లించుతున్నారు. భారతదేశంలో కార్మికులు సంఘటితరంగంలో 15 శాతం, అసంఘటితరంగంలో 85 శాతం పనిచేస్తున్నారు. అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న చట్టాలను సరిగ్గా అమలుచేయటం లేదు. సరిగదా వాటిలో కొన్నిటిని సవరించటం, మరికొన్నిటిని రద్దుచేసే ప్రతిపాదనలు కార్మికుల బాహుళ్యం ముందు కేంద్రం ప్రతిపాదించిన విషయం గమనంలో వుండాలి. ప్రజారాశులకు సంబంధించిన చట్టాలను ప్రయోజనరహితంగా చేయటం పాలకయంత్రాంగం, పెట్టుబడిదారులు, పాలకులకు వెన్నతో పెట్టిన విద్య! వలసకార్మికుల చట్టాలకు అదే గతి పట్టించాయన్నది వాస్తవం! ఏ రకమైన చట్టం అయినా, అది, ఉపశమనం వరకు పరిమితమవుతున్నదేగాని వారి మౌలిక సమస్యల పరిష్కారం వూసే వుండదు. అటువంటి పాలకుల ప్రజా–కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించి, నూతన ప్రజాస్వామిక వ్యవస్థను నెలకొల్పడంలో ప్రధానపాత్ర వహించాల్సిన ట్రేడు యూనియన్లు, కార్మిక పార్టీలు పునరాలోచన, పునర్నిర్మాణం చేసుకోవాల్సిన ప్రధాన కర్తవ్యంగా తమ భుజస్కంధాలకెత్తుకోవడం ఆవశ్యకం!

**కనువిప్పు కల్గించిన వలసకూలీల కాలినడకలు:**

లాక్‌డౌన్ రెండోవిడత ప్రకటన వెలువడిన వెంటనే వలస కార్మికులు తాము పనిచేస్తున్న రాష్ట్రాలనుంచి స్వంతరాష్ట్రం–పట్టణం/గ్రామానికి వెళ్ళాలనే నిర్ణయంతో ప్రయాణాలు సాగించారు. ఈ విధంగా బయలుదేరిన వారిని ఆయా రాష్ట్రాల పాలకులు, అధికారులు విరమింపచేయటంలో చూచి చూడనట్టుగా వ్యవహరించారు. కొన్ని ప్రాంతాలలో నిర్బంధించారు. కొంతమంది అన్ని వసతులు సమకూర్చుతామని, విరమింపచేయ టానికి అక్కడక్కడ ప్రయత్నించినా–ఇవేమి ఫలిత మివ్వలేదు. 500, 1000, 1500 కి.మీ దూరం అయినాసరే వెళ్ళాలన్న దృఢ సంకల్పంతోనే వ్యవహరించారు. వెనుదిరగలేదు. మార్గంలో ప్రజాసంస్థలు – ఉద్యోగసంస్థలు ఎక్కడికక్కడ సహాయక శిబిరాలు ఏర్పాటుచేసి, ఆహారం అందించినా, ఆహారపొట్లాలు సరఫరా చేసినా స్వీకరించారు. అవి లభ్యమైన ప్రదేశాలలో తిన్నారు. లేనిచోట్ల పస్తులున్నారు.

ఎప్పుడైతే వలసకూలీలు పయనమై ముందుకు సాగారో టి.వి. ఛానల్స్ ఆ దృశ్యాలను చిత్రించి దేశవ్యాప్తంగా ప్రసారం చేశాయి. సామాజిక మాధ్యమాలు వారినడక దృశ్యాలను చిత్రించి, విరివిగా వెల్లువెత్తేలా చేశాయి. ఇక పత్రికలయితే ఎంతో ప్రాధాన్యత యిచ్చి, ఎన్నో రిపోర్టు లిచ్చాయి.

ఈ పరిస్థితుల మధ్య పాలకులమీద తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో పాలకులు కదిలి కంటితుడుపు చర్యలు చేపట్టారు. కార్మికుల రైళ్ళను ప్రత్యేకంగా వలసకూలీలకు ప్రధాన మార్గాలలోనే ఏర్పాటు చేశారు. ప్రయాణంలో వారికి అవసరమైన ఆహారం, మంచినీరు వగైరా సరఫరా చేశారు. రైల్వేలకు అందుబాటులో లేనివార్ని రాష్ట్ర పాలకులు బస్‌లను సమకూర్చి, స్వంత గ్రామాలకు చేర్చారు. చివరకు సుప్రీంకోర్టు జూన్ 5న వలసకూలీల ప్రయాణంలో పాలకులు పాటించాల్సిన జాగ్రత్తలను, అవసరమైన సౌకర్యాలను కల్పించాలని నిర్దేశిస్తూ ఆదేశాలు జారీచేసింది.

కావిడి ఎన్నివంకర్లు తిరిగినా చివరకు ఇంటికి చేరిందన్న చందంగా ఇన్నో ఇక్కట్లు ఎదురైనా కొంతమంది ఆకలితో, అనారోగ్యాలతో, ప్రయాణాలలో మరణించినా ఎట్టకేలకు వలస కూలీలు సొంతూళ్ళకు చేరగల్గారు. కాలినడకన ప్రయాణించిన వారి పాదాలు పగిలి నెత్తురోడిన చారికలు ఎంతో కలవరపెట్టాయి.

ఆధునిక విజ్ఞానం, అందులో మార్క్సిస్టు విజ్ఞానాన్ని మరింతగా బోధపరచుకోవడం, కార్మికవర్గాలలో, శ్రమజీవుల్లో, చిన్న, సన్నకారు రైతు–కూలి వర్గాలలో కార్మికవర్గ భావజాలాన్ని, వర్గ చైతన్యాన్ని పెంపొందించే ట్రేడ్ యూనియన్ల అభివృద్ధిని, ఐక్యతను సాధించాలి.

నేటి కరోనా – లాక్‌డౌన్‌ల కాలంలో సంఘటిత, అసంఘటిత అన్నిరకాల కార్మికవర్గం నేటి వలస కార్మికులు ప్రత్యక్షంగా గడించిన అనుభవాలను, మార్క్సిస్టు విజ్ఞానంతో మేళవింపు చేసుకుంటూ మరింతగా ట్రేడ్ యూనియన్లను నిర్మించుకుంటూ, సమరశీలంగా ఆందోళనలు – వర్గపోరాటాలు, ప్రజాపోరాటాలు సాగించడమే కర్తవ్యం! ఈ కర్తవ్య నిర్వహణలో భాగస్వాములు కావాలి!!

ooo